## మొసలి దాడిలో ఆవు మృతి

ఏర్గట్ల, జూన్ 16: మండల కేంద్రంలోని ఊర చెరువులో నీరు తాగేందుకు వెళ్లిన ఆవుపై మొసలి దాడి చేసి చంపివేసిందని ఆవు యజమాని ముని మాణిక్యం భూమేశ్ తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. ఆదివారం ఉదయం గర్భంతో ఉన్న ఆవు చెరువులోకి నీరు తాగేందుకు వెళ్లింది. యజమాని చూస్తుండగానే చెరువులో ఉన్న మొసలి ఆవును మూతి భాగాన్ని పట్టుకొని చెరువు లోతులోకి లాక్కెళ్లింది. నీటిలో ఆవుకు ఊపిరాడక మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ.90 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. చెరువులో మొసలి ఉందని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని, స్థానిక రజకులు, మత్స్యకారులు తెలిపారు.

## తప్పిపోయిన బాలిక ఆచూకీ లభ్యం



బాలికను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

భీమ్‌గల్, జూన్ 16 : ఈనెల 15న తప్పిపోయిన పదేండ్ల బాలిక షేక్ మహీరా ఆచూకీ లభించిందని ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆర్మూర్‌కు చెందిన చిన్నారి భీమ్‌గల్ పట్టణానికి చెందిన తన తాత అమీర్‌ఖాన్ ఇంటికి వచ్చింది. మతిస్థిమితం లేని చిన్నారి ఆడుకుంటూ బయటికి వెళ్లి తప్పిపోయింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక ఆచూకీ కోసం మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక రాతం చెరువులో గుర్రపు డెక్కలో చిక్కుకొని కనిపించింది. స్థానికులు పోలీసుల సహాయంతో బాలికను బయటికి తీసి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను సురక్షితంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు ఈద్ - ఉల్ -జుహా

సుభాష్‌నగర్/ కామారెడ్డి, జూన్ 16 : త్యాగానికి ప్రతీకగా భావించే ఈద్–ఉల్–జుహా (బక్రీద్) పండుగను సోమవారం సంప్రదాయ బద్ధంగా జరుపుకొనేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. కామారెడ్డి పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉన్న ఈద్గా, మసీదులను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. పండుగ రోజు ఖుర్బానీ ఇచ్చే ఆచారం ఉండగా.. మార్కెట్‌లో పొట్టేళ్లను కొనుగోలు చేశారు. ఆవులను కోయవద్దని, పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ముస్లిములకు పోలీసులు సూచనలు చేశారు.

ఖుర్బాని అంటే త్యాగం అని అర్థం. మూడు రోజులపాటు పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఖుర్బానీ అనగా పొట్టేళ్ల మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి, మొదటి భాగం ఇంటి కోసం, రెండో భాగం బంధువులకు, మూడో భాగం నిరుపేదలకు పంపిణీ చేస్తారు.

**హజ్ యాత్ర ఈ మాసంలోనే....**

ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనుకుంటారు. ఈ యాత్ర బక్రీద్ మాసంలో చేయడం ఆనవాయితీ. మదీనాలోని మహ్మద్ ప్రవక్త దివ్య సమాధి దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఖిల్లారోడ్డులో ఈద్గా వద్ద ప్రార్థనల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు

**నిజామాబాద్ జిల్లా కేంద్రంలో..**

నిజామాబాద్ కేంద్రంతోపాటు వివిధ మండలాలు, గ్రామాల్లో సామూహిక ప్రార్థనల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని ఖిల్లా ప్రాంతం వద్ద ఉన్న ప్రార్థన ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తు చేపట్టనున్నది.

**బక్రీద్ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు..**

వినాయక్‌నగర్, జూన్ 16 : బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖిల్లా ఈద్గా, బోధన్ బస్టాండ్ ఈద్గా, పూలాంగ్ ఈద్గాల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు.

- బోధన్ వైపు వెళ్లే వాహనదారులు నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, శివాజీచౌక్, గంజ్, నిజాంకాలనీ మీదుగా అర్సపల్లి మీదుగా బోధన్‌కు వెళ్లాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లేవారు మాధవనగర్ బైపాస్ రోడ్డు నుంచి కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్ నుంచి అర్సపల్లి మీదుగా బోధన్‌కు వెళ్లాలి.
- బోధన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే వాహనదారులు అర్సపల్లి సర్కిల్ నుంచి కొత్త కలెక్టరేట్ మీదుగా కంఠేశ్వర్ బైపాస్, ధర్నాచౌక్ చౌరస్తా, రైల్వేస్టేషన్ ముందు నుంచి ఆర్టీసీ బస్టాండ్ రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నగర ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, వెళ్లే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి, పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఘనంగా బోనాల పండుగ



బోనాల ఊరేగింపులో పాల్గొన్న పోచారం గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, జూన్ 16: మండలంలోని పోచారం గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పోచమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో దేవతామూర్తులకు ఒడిబియ్యం పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అందంగా అలంకరించిన బోనాలను డీజే సౌండ్, డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలతో ఊరేగించారు. బోనాలను దేవతామూర్తులకు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వినీత, నాయకులు, మాజీ సర్పంచులు ఆకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, గోపాల్‌గౌడ్, విజిత, శ్రీకాంత్, కిరణ్, దుర్గారెడ్డి, యాదగిరిగౌడ్, నందునాయి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

- రికవరీ చేసి, అప్పగించిన పోలీసులు



పోలీసులు రికవరీ చేసి ఇచ్చిన డబ్బులతో లక్ష్మణ్

వినాయక్‌నగర్, జూన్ 16 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రూ. 2 లక్షలు ఉన్న బ్యాగును వారం రోజుల క్రితం పోగొట్టుకున్నాడు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో రూ. 2 లక్షల నగదు బ్యాగును పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మణ్ అనే వ్యక్తి ఈ నెల 8వ తేదీన రూ.2 లక్షల నగదును ఏటీఎంలో డిపాజిట్ చేయడానికి వచ్చాడు. అదేసమయంలో అతడికి ఫోన్ కాల్ రావడంతో క్యాష్ బ్యాగును ఏటీఎం సెంటర్ క్యాబిన్‌లో మరిచిపోయాడు. బ్యాగును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి క్యాష్ బ్యాగును ఏటీఎంకు వచ్చిన మరోవ్యక్తి తీసుకెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో సదరు వ్యక్తి ఎవరో గుర్తించి, క్యాష్ బ్యాగును ఆదివారం రికవరీ చేసి బాధితునికి అప్పగించారు. తన డబ్బులను రికవరీ చేసి అప్పగించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

# దివ్యాంగుల కోటా తుది ఫలితాలెప్పుడు?

- 4నెలలుగా పెండింగ్‌లోనే పీడబ్ల్యూడీ జాబితా
- మెడికల్ టెస్టులు ముగిసినా ఫలితాలు వెల్లడించని ట్రిబ్
- పెండింగ్‌లో 7వ జోన్ అభ్యర్థుల లిస్టు

హైదరాబాద్, జూన్16 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో దివ్యాంగుల కోటా అభ్యర్థుల తుది జాబితా వెల్లడిలో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. ఇతర అన్ని క్యాడర్ పోస్టుల ఫలితాలను ప్రకటించినా, దివ్యాంగుల కోటా అభ్యర్థులను ఇప్పటివరకు వెల్లడించలేదు. 1:2 జాబితాను ప్రకటించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించినా తుది జాబితాను ప్రకటించకపోవడంతో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. 9,210 గురుకుల పోస్టులకు సంబంధించి ట్రిబ్ నియామక ప్రక్రియ చేపట్టింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్ పోస్టులకు తొలుత 1:2 నిష్పత్తిలో మెరిట్ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. అందులో పీడబ్ల్యూడీ కోటా అభ్యర్థులు సైతం ఉన్నారు. గత ఫిబ్రవరిలో అలాట్‌మెంట్ ఆర్డర్లను సైతం అందజేసింది. అందులో పీజీటీ పోస్టుల పీడబ్ల్యూడీ అభ్యర్థులు సైతం ఉన్నారు. డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులకు మాత్రం పీడబ్ల్యూడీ కోటా అభ్యర్థుల 1:1 జాబితాను మాత్రం ఇప్పటివరకు ట్రిబ్ ప్రకటించనేలేదు. త్వరలోనే ఆ జాబితాను విడుదల చేస్తామని చెప్పి ఫిబ్రవరిలోనే ట్రిబ్ వెబ్‌నోట్‌ను పెట్టింది. 4 నెలలు గడిచినా ఇప్పటివరకు దానిపై ఉలుకూపలుకు లేదు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా 7వ జోన్ పరిధిలో 1:1 అభ్యర్థుల జాబితాను సైతం ట్రిబ్ ప్రకటించలేదు. ఎన్నికల కోడ్ ముగిసి 10 రోజులు దాటినా ట్రిబ్ స్పందించకపోవడంపై ఆయా అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

## '30 నెలల్లో అమరావతి నిర్మాణం'

హైదరాబాద్, జూన్16 (నమస్తే తెలంగాణ): వచ్చే 30 నెలల్లో అమరావతిలో ఏపీ రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. వెలగపూడిలో ఆదివారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూడు దశల్లో చేపట్టనున్న రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్ల వ్యయం అవుతుందని, మొదటి దశ పనులకు 48 వేల కోట్లు ఖర్చవుతుందని వివరించారు. 15 రోజులపాటు అధ్యయనం చేసి నిర్దేశిత గడువుతో పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

## టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : తెలుగు దేశం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఏపీ అధ్యక్షుడిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడుకు మంత్రిగా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో బీసీ–యాదవ వర్గానికి చెందిన పల్లాకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్‌తో ఆర్థికంగా నష్టపోయిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట భానుప్రసాద్ (24) కొన్నిరోజులుగా ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతూ రూ.1.50 లక్షలు పోగొట్టుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఐదురోజుల క్రితం తన వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు రామాయంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అల్లుడిని హతమార్చిన మామ

**జోగుళాంబ గద్వాలలో ఘటన**

ఉండవెల్లి, జూన్ 16 : కూతురిని వేధిస్తున్నాడన్న కోపంతో ఓ తండ్రి అల్లుడిని హతమార్చాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటి, రాములమ్మ దంపతుల కూతురు మహేశ్వరిని ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన దేవేందర్(36)తో ఆరేండ్ల కిందట పెండ్లి చేశారు. వీరికి ఇద్దరు సంతానం. దేవేందర్ మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో మద్దిలేటి తన కూతురిని పదిరోజుల కిందట ఉండవెల్లికి తీసుకొచ్చాడు. కాగా, దేవేందర్ శనివారం మద్యం తాగి రాత్రి 10:30 గంటలకు ఉండవెల్లికి కొచ్చి మరోసారి గొడవపడి నిద్రపోయాడు. అర్ధరాత్రి కాగానే మద్దిలేటి తన ఇంటి ముందున్న బండరాళ్లు, సిమెంట్ ఇటుక తీసుకొచ్చి దేవేందర్ తలపై మోది హత్య చేశాడు. మరో గదిలో ఇద్దరు పిల్లలతో పడుకున్న మహేశ్వరి తెల్లవారుజామున లేచి చూడగా తన భర్త రక్తపుమడుగులో పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. నిందితుడు మద్దిలేటి పరారీలో ఉన్నాడు. మృతుడి తల్లి జయమ్మ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

# తల్లికి క్యాన్సర్.. పట్టించుకోని కొడుకులు

- చికిత్స కోసం రూ.15 లక్షలు అప్పు చేసిన తండ్రి
- తండ్రి పేరిట భూమి అమ్మకానికి నిరాకరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- న్యాయం చేయాలని వేడుకుంటున్న వృద్ధ దంపతులు



దొనికెల శంకరయ్య, విజయ దంపతులు

వేలేరు, జూన్ 16: హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లికి చెందిన దొనికెల శంకరయ్య తన భార్య విజయకు క్యాన్సర్ వచ్చింది. చికిత్సకు చేసిన అప్పు తీర్చేందుకు తన పేరిట ఉన్న రెండెకరాలు అమ్మడానికి ప్రయత్నించగా, కొడుకులు అడ్డువస్తున్నారని ఆయన మీడియాతో వాపోయారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించు కోవడంలేదని పేర్కొనారు. శంకరయ్య దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉండగా.. అందరికీ వివాహమైంది. సుమారు 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. ఇద్దరు కొడుకులకు చెరో 4 ఎకరాల భూమిని పంచి తన పేరిట 2 ఎకరాల భూమిని ఉంచుకున్నాడు. ఇటీవల శంకరయ్య భార్య విజయకు క్యాన్సర్ నిర్ధారణ కాగా.. చికిత్స కోసం సుమారు రూ.15 లక్షల అప్పు చేశాడు. వీటిని తీర్చేందుకు శంకరయ్య తన పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమిని అమ్ముదామంటే ఇద్దరు కొడుకులు అడ్డుపడుతున్నారు. కొడుకులపై వేలేరు ఎస్సై, ధర్మసాగర్ సీఐ, కాజీపేట ఏసీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని శంకరయ్య దంపతులు వాపోయారు. 'మీరు ఎక్కడికి పోయినా మాకు ఏం కాదని, మాకు మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలు ఉన్నాయి' అని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

# కరీంనగర్ బస్టాండ్‌లో వలస కూలీ ప్రసవం

***పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బంది.. తల్లీబిడ్డ క్షేమం***

*తెలంగాణచౌక్, జూన్ 16: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఓ వలస కూలీ ప్రసవించింది. ఆర్టీసీ సిబ్బంది సహాయం తో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన కుమారి–దులా దంపతులు పనిచేస్తున్నారు. కుమారి గర్భవతి కావడం, నెలలు నిండటంతో డెలివరీ కోసం సొంత రాష్టానికి వెళ్లేందుకు అదివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు కోసం ఎదురుచూస్తుండగా.. ఇంతలో కుమారికి నొప్పు లు మొదలయ్యాయి. సి బ్బంది వెంట నే ఏటీఎం రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ అంజయ్యకు సమాచారం ఇచ్చారు. నొప్పులు మరింత ఎక్కువ కావడంతో బస్టాండ్‌లోని స్వీపింగ్ సూపర్‌వైజర్ సైదమ్మ, సిబ్బంది శ్రవంతి, లావణ్య, భవాని, రేణుక కలిసి పురుడు పోయగా.. పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమం గా ఉన్నారు. ఇద్దరినీ 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎవరూ తోడులేని వలస కార్మికురాలికి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని పలువురు అభినందించారు.*



ఎంసీహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

# సర్కారు దవాఖానలో స్పర్శ కోల్పోయిన బాలింత

- శస్త్రచికిత్సలో ఎంసీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం!
- దవాఖాన వద్ద బాధిత కుటుంబీకుల ఆందోళన

మంచిర్యాల ఏసీసీ, జూన్ 16: ఓ గర్భిణికి వైద్యులు శస్త్రచికిత్స చేసి పురుడుపోసిన అనంతరం నడుము నుంచి కాళ్ల వరకు స్పర్శను కోల్పోయింది. ఆపరేషన్ సమయంలో డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే బాలింత స్పర్శ కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతా, శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా పాత బెల్లంపల్లికి చెందిన గర్భిణి ఆవునూరి గంగ ఈ నెల 9న (ఆదివారం) డెలివరీ కోసం మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. ఈ నెల 10న (సోమవారం ఉదయం) వైద్యులు ఆపరేషన్ చేయగా బాబుకు జన్మనిచ్చింది. వారం రోజులు గడిచిన తర్వాత ఆమె నడుము నుంచి కాళ్ల భాగం వరకు స్పర్శను కోల్పోయింది. భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు వైద్యులకు తెలుపగా స్కానింగ్ చేసుకుని రమ్మన్నారు. ఆ స్కానింగ్‌లో నడుము, కాళ్లకు సంబంధించిన నరం కట్ అయినట్టు వెల్లడించారు. ఆపరేషన్ సమయంలో వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వైద్యులతో మాట్లాడించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బాలింతను ప్రత్యేక అంబులెన్సులో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు.





